# కలం స్నేహితురాలు

భట్టు ఉదయకుమార్



**నిజంగా కొన్ని కొన్ని చిన్న విషయాలు కూడా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని జ్ఞాపకాల్లా మిగిలిపోతాయి కదా! నాకు ఓ జీవిత పాఠంలో ఈ నిజం తెలిసింది. అది నేను ఈ జన్మలో మరచిపోలేను.**

నాకప్పుడు పదిహేడు సంవత్సరాలు. ఒకరోజు నేను ఓ ప్రముఖ హైదరాబాదు (ఆంగ్ల) మాసపత్రికలోని పేజీలను తిప్పుతుండగా "విదేశీ యువతీ యువకుల చిరునామాలు" అని (ఆంగ్లంలో) తాటి కాయలంత అక్షరాలు కనిపించేసరికి నా కళ్ళు అక్కడే ఆగిపోయాయి. ఆ పేజీలో ఉన్న చిరునామాలుగలవారికి భారతదేశంలో కలం స్నేహితులు కావాల్ట. మా కాలేజీలో విద్యార్థులు.విద్యార్థినులూ చాలామంది సాలాసార్లు లావాటి ఎయిర్ మెయిల్ కవర్లు కాలేజీకి తీసుకొచ్చి వాళ్ళ వాళ్ళ స్నేహితులకి చూపిస్తూ ఉండేవారు. వాళ్ళని చూసినప్పుడల్లా నాకూ ఓ కలం స్నేహితుడో, ఓ కలం స్నేహితురాలో ఉంటే ఎలా ఉంటుంది అని అనుకుంటూండేవాడిని. ఇప్పుడా చిరునామాలు చూసేసరికి నాకెంత సంతోషమేసిందో. వెంటనే ఓ ఎడ్రెసు తీశాను. పేరు మిస్. మేరీ కితాబతాకే. జపాన్ దేశపు యువతి. వెంటనే బజారెళ్ళి ఓ అందమయిన విలువయిన "రైటింగ్ ప్యాడ్" (లేత గులాబీ రంగుది) కొనుక్కొచ్చాను.

మొదటి పేజీమీద "డియర్ పెన్ పాల్" అంటూ విద్యార్థి మొదటి సారి పరీక్షరాసేటప్పుడు ఎంత భయపడతాడో, అంతకు రెండింతలు భయంతో రాయటం మొదలెట్టాను. సరిగ్గా గంట పట్టింది ఉత్తరం వ్రాయటానికి. అది రాసి పోస్ట్ చేసేంతవరకూ ఊపిరి కూడా తీసుకోలేకపోయాను.

జపాన్ నుంచి రిప్లయి త్వరగానే వచ్చింది. "మీ దేశంలోని ఓ పత్రికలో నా పేరు.చిరునామా ముద్రింపబడటం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే నాకు కలం స్నేహితులు కావాలని నేనే పత్రికకీ వ్రాయలేదు. కానీ మీ ఉత్తరం చూసిన తరువాత మీ కోరిక ప్రకారం నేను మీతో కలం స్నేహం సాగిద్దామని అనుకుంటున్నాను." (అని ఆంగ్లంలో వ్రాసింది) ఆ నాలుగు లైన్లూ ఎన్నిసార్లు చదివానో నాకే తెలీదు. నిజంగా దాంట్లో జీవిత

సంగీతమే ధ్వనియించినట్లు అనిపించింది. ఆ ఆనందంలో మునిగిపోయి స్వర్గపు టంచుల వరకూ వెళ్లానంటే నమ్మండి.

నేను ఆ జపాన్ అమ్మాయికి ఉత్తరాలు రాసేటప్పుడు చాలా జాగ్రతలు తీసుకునే వాడిని. ఆ అమ్మాయి మూడాఫ్ చేసే విషయాలు అసలు రాసేవాడినే కాదు. ఆ అమ్మాయి ఆంగ్లం చాలా బాగా రాసేది. నాకేమో అదో విదేశీభాష. ఎన్నో తంటాలు పడినేర్చుకున్నాను అయినా నాహృదయపు లోతుల్లో ఎక్కడో దాగివున్న "సెన్స్ ఆఫ్ రొమేన్స్"ని మాత్రం ఆంగ్లంలో వ్యక్తపరచలేకపోయేవాడిని.

ఒకసారి మా స్నేహితులందరికీ. జపాన్ స్నేహితురాలు ఎలా ఉంటుందీ? అన్న సందేహం వచ్చి "ఆమె ఫొటో ఒకటి పంపమని రాయరా" అన్నారు నాతో. ఆమెకి మీ ఏజ్ ఎంత? అని అడిగితే ఆమె మూడాఫ్ అవుతుందేమో కానీ. ఫొటో అడిగితే ఏమవుతుంది? అనుకుని వెంటనే ఆమెకో ఉత్తరం రాసేశాను ఓ ఫొటో పంపమని. ఓ రెండు వారాల తర్వాత ఆమె దగ్గరున్నించి రిప్లయ్ వచ్చింది. కానీ ఆమె ఫొటో మాత్రం పంపలేదు. "నా దగ్గిర ఇప్పుడు సరయిన ఫొటోలేవీ లేవు. త్వరలోనే పంపగలను" అని మాత్రం రాసిందామె. ఇటువంటి విషయాల్లో మాత్రం నాకు చాలా ఓర్పు. ఆ ఓర్పునే వహించాను.

అలా కొన్ని సంవత్సరాలు దొర్లాయి. మేరీతో నా స్నేహం మొదటంత ఉత్సాహంగా పంక్చువల్‌గా కొనసాగటం జరగటల్లేదు. కానీ నేను మాత్రం ఆమె ఆరోగ్యం బావో లేదని ఆమె దగ్గరున్నించి ఎప్పుడు ఉత్తరం వచ్చినా "భగవంతుడి దయవల్ల నువ్వు త్వరగా కోలుకుంటావులే" అని మాత్రం వ్రాస్తుండేవాడిని. అలా చాలా కాలం గడిచిపోయింది. ఆమె ఫొటో మాత్రం పంపలేదు. నేనూ పెద్ద వాడ్నయిపోయాను. పెళ్ళయింది. పిల్లలూ. ఉద్యోగమూ. అన్ని బాధ్యతలూ ఒకేసారి నా భుజాలమీద పడ్డాయి. ఓసారి నా భార్య సాయికి మేరీ ఉత్తరాలు చూపించాను. ఆమె నిజంగా ఆశ్చర్యపోయింది. "మేరీ"ని కలవాలనే కోరిక నాలోనే కాదు; ఆమెలోనూ. చివరికి మా పిల్లల్లోనూ బలపడిపోయింది.

అదలా వుండగా ఒక రోజు. నాకు జపాన్నుంచి ఓ పెద్ద కవరొచ్చింది. దాని మీద చేవ్రాత "మేరీ" చేవ్రాతలా లేదు. మరి ఈ కొత్త ఫ్రెండ్ ఎవరో అనుకుని కవరు చించి దాంట్లోంచి ఓ ఉత్తరాన్ని బయటికి తీశాను.

అందులో (ఆంగ్లంలో) ఇలా వుంది:

టోక్యో

....................

డియర్ ఫ్రెండ్.

మీ కలం స్నేహితురాలైన "మేరీ" కి ఓ ప్రాణ స్నేహితురాలిగా మీకో విషయం రాయటానికి చాలా బాధపడుతున్నాను. 'మేరీ' గత ఆదివారం చర్చికెళ్ళి కారులో వస్తూండగా ఆక్సిడెంట్ జరిగింది. ఆ యాక్సిడెంట్‌లో 'మేరీ' ప్రాణం పోయింది. ఆమె వయస్సు మళ్ళినది (ఈమధ్యే 78వ పుట్టిన రోజు చేసుకున్నది.) కావటం వల్ల చూపు సరిగా ఆనక కారుని ఎదురుగా వస్తున్న మరో కారుకి గుద్దేయటం వలన ఈ ప్రమాదం జరిగింది. ఈ ఉత్తరంతో పాటూ మేరీ కోరిక ప్రకారం మీకో ఫొటో పంపుతున్నాను. ఆమె చనిపోయేముందు ఒకసారి నా దగ్గరకొచ్చి ఒకవేళ నేను చనిపోతే నా ఫొటో నా భారతీయ స్నేహితుడికి పంపవే అని ఓ ఫొటోతోపాటు మీ చిరునామా కూడా ఇచ్చింది. నాతో ఒట్టు కూడా పెట్టించుకుంది దాని ఆఖరి కోరికగా మీకా ఫొటో పంపుతున్నాను.

యువర్స్ సిన్సియర్లీ.

కూమీ ఒకానో

ఆ ఉత్తరం చదవగానే నా గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలైనంతగా ఫీలయ్యాను. ఆత్రంగా కవరు లోపలున్న ఓ ఫొటోని బయటికి తీశాను.

అక్కడక్కడ ముడతలుపడిన ఎర్రటి ముఖం అందానికీ అమాయకత్వానికీ నిలయంలా వుంది. హృదయ ప్రతిబింబాలైన కళ్ళు అనురాగాన్ని ప్రతిబింబింపజేస్తున్నాయి. ఆ ఫొటోని పట్టుకుని అలాగే సోఫాలోకి కూలిపోయాను. నా స్నేహితురాలి ఆత్మకు శాంతి కలిగించమని ఆఖరిసారిగా భగవంతుని కోరుతూ. ఆమెకోసం రెండు కన్నీటి బొట్లు మాత్రం రాల్చగలిగాను. *

## ఊహాల పందిరి

విశాఖలో నీవు
 విషాదంలో నేను
నిన్ను చేరాలని,
నీ ఒడిలో వాలాలని.
నీ కళ్ళతో బాసలెన్నో చేయాలని.



నీ కౌగిలిలో కాలమే
 మరిచిపోవాలని
అనిపిస్తుంది క్షణం. క్షణం!
కాని,
ఆకాశంలో చందమామలా నీవు,
సముద్రపు అలలా నేను!
సాధ్యమా ఆ కలయిక!
ఈ ఊహాలే మిగులు నాకిక!!

—'స్వప్న'

